TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు   తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను.
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 239 | సోమవారం 05-05-2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

## ప్రధాని మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ


**ప్రధాని నరేంద్ర మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ భేటీ అయ్యారు.**



దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ భేటీ అయ్యారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో ఈ సమావేశం జరిగింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. అంతకు ముందు రోజే నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠీ కూడా ప్రధానిని ఆయన నివాసంలో కలుసుకున్నారు.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు ఈ భేటీలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. లక్ష్యాలు, దాడి సమయం అవి నిర్ణయిస్తాయని నాడు సీసీఎస్ వెల్లడించింది. ఇక శుక్రవారం సన్నద్ధతలో భాగంగా యూపీలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ విన్యాసాలను నిర్వహించింది.


2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత్ వాయుసేన పాక్‌లోకి ప్రవేశించి దాడి చేసింది. నాటితో పోల్చుకొంటే రఫెల్ యుద్ధ విమానాలు, ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో ఐఏఎఫ్ శక్తి గణనీయంగా పెరిగింది.



## బీసీ వ్యక్తిని తీసేసి..

### మీరెందుకు పార్టీ అధ్యక్షుడయ్యారు : పొన్నం

కులగణనపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఫైర్



అయ్యారు మంత్రి పొన్నం ప్రభాకర్. తెలంగాణలో తాము చేసింది జనాభా లెక్కలు చేయలేదని ..

కులగణన చేశామని అన్నారు. కిషన్ రెడ్డికి ఈ విషయం తెలీక విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. జనాభా లెక్కలు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి .. కులాల లెక్కలు తేల్చే అధికారం రాష్ట్రానికి ఉందన్నారు.దేశానికి రోల్ మోడల్ గా తెలంగాణ కుల గణన సర్వే చేసింది.. రాహుల్ డిమాండ్ మేరకే కేంద్రం కులగణన చేస్తామని చెప్పడం కాంగ్రెస్ విజయమని అన్నారు. బీసీ వ్యక్తిని తీసేసి కిషన్ రెడ్డి బీజేపీ అధ్యక్షుడెందుకు అయ్యారో ముందు సమాధానం చెప్పాలన్నారు పొన్నం.



సామాజిక పరంగా రాబోయే కాలంలో తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేయడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు పోతున్నారు పొన్నం. జస్టిస్ సుదర్శన్ రెడ్డి,కంచె ఐలయ్యలతో కలిసి కమిటీ వేశామని చెప్పారు.

2 లో

## 60 చదరపు గజాల్లో కడితేనే ఇందిరమ్మ ఇండ్లకు బిల్లు: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

ఒకే కుటుంబంలో ఇద్దరికి ఇల్లు మంజూరు చేయరు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చింది.



2 లో

## మిస్ వరల్డ్ పోటీలు..

### హైదరాబాద్ చేరుకున్న బ్రెజిల్ బ్యూటీ జెస్సికా



హైదరాబాద్ లో ప్రపంచ సుందరీమణుల సందడి మొదలైంది. మే10న హైదరాబాద్ లో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో ప్రపంచ అందగత్తెలు ఒక్కొక్కరుగా హైదరాబాద్ కు చేరుకుంటున్నారు. ఈ కంటెస్ట్ లో పాల్గొనేందుకు బ్రెజిల్ సుందరి జెస్సికా స్కాండుజ్ పెడ్రోసో ఆదివారం (మే4) శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం తరపున అధికారుల బృందం సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు.

మిస్ వరల్డ్ 2025 పోటీలకు హైదరాబాద్ రెడీ అయ్యింది. మే 10నుంచి మే 31 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. మూడు వారాలపాటు 120 దేశాలకు చెందిన అందగత్తెలు హైదరాబాద్ లో సందడి చేయనున్నారు. ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. తొలిసారి హైదరాబాద్ లో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్నాయి.

గచ్చిబౌలీ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. మే 31న ఫైనల్స్ ఉంటాయి. ఈ పోటీల్లో పాల్గొనే బ్యూటీలు మే 8లోపు హైదరాబాద్ చేరుకోనున్నారు. తొలిసారి హైదరాబాద్ లో జరగనున్న ఈ అందాల పోటీల్లో పాల్గొనేందుకు ప్రపంచ నలుమూలల నుంచి వివిధ దేశాల సుందరీమణులు, వారి ప్రతినిధులు పాల్గొంటారు.



## మావోయిస్టులతో మాటల్లేవ్.. మాట్లాడుకోడాల్లేవ్.. బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

»మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదు.

»తుపాకీతో అమాయకులను చంపేవారితో చర్చలు ఉండవు.

»మావోయిస్టులపై నిషేధం విధించింది కాంగ్రెస్సే.

»మావోయిస్టులు పలు పార్టీల నేతలను, గిరిజనులను చంపారు.

2 లో



## దక్షిణ తెలంగాణకు గత ప్రభుత్వం అన్యాయం చేసింది: మంత్రి ఉత్తమ్



2 లో

»ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును నిర్ణీత సమయంలో పూర్తి చేస్తాం.

»ఆగిపోయిన కందమల్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తాం.

»గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి పెట్టింది.

»దక్షిణ తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు.

## యుద్ధం మొదలైతే.. పాక్ శతఘ్ని గుండ్లు నాలుగు రోజుల్లో ఖాళీ..!

పాకిస్థాన్ వద్ద ఆత్మరక్షణ సామర్థ్యానికి అవసరమైన శతఘ్ని గుండ్లు అత్యంత తక్కువగా ఉన్నాయి. ఈ విషయాన్ని ఓ ఆంగ్ల వార్తా పత్రిక కథనంలో పేర్కొంది.



2 లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం: హరీశ్‌రావు

»విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు.



2 లో

# సంపాదకీయం

## ఆంధ్ర ప్రగతికి అమరావతి

అమరావతి పనులు పునఃప్రారంభమయ్యాయి. మూడేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజధాని పనులు వేగంగా, గడువులోపు పూర్తవడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఇదొక శుభపరిణామం.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతి కొందరిదే అన్న భావనను ఒక వర్గం ప్రజల్లో బలంగా వ్యాపింపజేయడంలో జగన్ రెడ్డి సక్సెస్ అయ్యారు. ఇప్పుడు ఆయన మళ్లీ ప్రతిపక్షంలో ఉన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అమరావతి నిర్మాణం పూర్తయ్యే వరకు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

భారతదేశంలో బెంగళూరు, హైదరాబాద్ మాత్రమే ఐటీకి కేరాఫ్‌గా అభివృద్ధి చెందాయంటే ఎస్.ఎం.కృష్ణ, చంద్రబాబు పోటీపడటం వల్లనే. అప్పట్లో కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా ఉన్న వీరిరువురూ ఐటీని అభివృద్ధి చేయడంలో పోటీ పడ్డారు.

రాజధాని నిర్మాణం కోసం యాభై వేల ఎకరాలు అవసరమా? అని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంతమంది అపర మేధావులు ఇప్పటికీ కూనిరాగాలు తీస్తున్నారు. ఇలాంటి వాళ్లు హైదరాబాద్ అభివృద్ధి ఎలా జరిగిందో తెలుసుకోవాలి.

అమరావతి నిర్మాణానికి ఖర్చు చేయబోయే డబ్బుకు రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేదు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చిన భూముల్లో ప్రభుత్వానికి తన వాటాగా వచ్చే భూమిని అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా రాజధాని నిర్మాణానికి నిధులు సమకూర్చుకుంటున్నారు. అందుకే ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అయింది.

హైదరాబాద్ ఈ స్థితికి రావడానికి మూడు దశాబ్దాలకు పైగా సమయం పట్టింది. అమరావతిలో కూడా అభివృద్ధి జరిగితే భూములు ఇచ్చిన రైతులు మైనారిటీలు అవుతారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారి సంఖ్యే అధికంగా ఉంటుంది. ఇప్పుడు జగన్ అండ్ కో ఏడుస్తున్నట్టుగా 'ఆ వర్గం' వారు ఎక్కడుంటారో కూడా తెలియదు.

అమరావతిలో చేపట్టిన పనుల వల్ల జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి దాదాపు పదివేల కోట్ల రూపాయలు సమకూరుతాయి. ఈ డబ్బుతో సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించవచ్చు. చంద్రబాబు చెప్పే మోడల్ ఇదే.

ప్రధానమంత్రి శుక్రవారం నాడు ప్రారంభించిన పనులతోనే రాజధాని నిర్మాణం సంపూర్ణం కాదు. ప్రభుత్వ నిర్మాణాలతో పాటు ప్రైవేటు రంగంలో కూడా నిర్మాణాలు జరిగినప్పుడే రాజధానికి ఒక రూపు వస్తుంది. "అమరావతి పేరిట ఒక వర్గం ప్రజలకు మేలు చేసేందుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయడం అవసరమా? రాష్ట్ర ప్రజలందరికీ చెందిన సొమ్మును ఒకే చోట ఖర్చు చేయడం ఏమిటి?" అని ప్రజలలో విష ప్రచారం చేస్తున్న వారికి వాస్తవం తెలియక కాదు. అమరావతి నిర్మాణానికి ఖర్చు చేయబోయే డబ్బుకు రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేదు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చిన భూముల్లో ప్రభుత్వానికి తన వాటాగా వచ్చే భూమిని అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా రాజధాని నిర్మాణానికి నిధులు సమకూర్చుకుంటున్నారు. అందుకే ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అయింది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి గ్రహణాలన్నీ ఇప్పుడు తొలగిపోయాయి. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం మూడేళ్లలో రాజధాని నిర్మాణానికి నేను కూడా భుజం కలుపుతానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అమరావతి కేవలం రాజధాని కాదు%-% ఒక శక్తి అని, రాజధాని పూర్తయితే రాష్ట్ర జీడీపీ ఎక్కడికి వెళుతుందో ఊహించగలనని కూడా ప్రధాని చెప్పారు. ఇదే అమరావతికి, ఇదే ప్రధానమంత్రి సుమారు పదేళ్ల కిందట శంకుస్థాపన చేశారు. కాలూ చేయీ కూడదీసుకొని పనులు ప్రారంభించి, ఒకస్థాయికి చేర్చేసరికి రాష్ట్రంలో ప్రభుత్వం మారి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు. మూడు రాజధానుల పల్లవి అందుకున్నారు. అప్పటి నుంచి అమరావతికి గ్రహణం పట్టింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అప్పటికే ఖర్చు చేసిన పది వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయింది. అమరావతిని భ్రమరావతిగా, కమ్మరావతిగా అభివర్ణించారు. వైసీపీకి చెందిన కాలనాగులు రాజధానిపై విషం చిమ్మాయి. ఫలితంగా ఆంధ్రుల కలల రాజధాని శ్మశానంగా మారింది. రేపటి కోసం చంద్రబాబు కలలుగన్న అమరావతి ఉసురు తీయాలనుకున్నారు. అమరావతి తమది కాదన్న భావనను ఒక వర్గం ప్రజలలో నూరి పోశారు. ఇది గతం! అమరావతి చంద్రబాబుది కాదు. లోకేశ్‌ది కాదు. ఆ సామాజిక వర్గానిదీ కాదు. రేపటికోసం నిర్మితం కాబోతున్న నగరమది. రేపటి తరం ఆ ఫలితాలను అందుకుంటుంది.

శుభపరిణామాలు...

ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అమరావతి పనులు పునఃప్రారంభమయ్యాయి. మూడేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజధాని పనులు వేగంగా, గడువులోపు పూర్తవడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఇదొక శుభపరిణామం. ఎందుకంటే, అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు 2029 వరకు అధికారంలో ఉంటాయి. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం పనులు జరిగితే ఆలోపే రాజధాని నిర్మాణం పూర్తవుతుంది. ఆ తర్వాత ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ రాజధానిని కదిలించలేరు. అయితే, ఇల్లు అలకగానే పండుగ కాదన్నట్టుగా శుక్రవారం నాటి ప్రధాని హామీతో అంతా సవ్యంగా జరుగుతుందని భావించలేం. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమరావతిపై అంతులేని ద్వేషాన్ని పెంచుకున్నారు. రాజధానికోసం భూములు ఇచ్చిన రైతుల ముఖాలు చూడ్డానికి కూడా అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఇష్టపడలేదు. గత ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిందిగానీ, వైసీపీకి అనుబంధంగా మారిన పోలీసులు, అధికారులు, జర్నలిస్టులుగా చలామణి అవుతున్న వాళ్లు, మేధావుల ముసుగులో తిరగాడుతున్న వాళ్లు, పిల్ల సైకోలు ఇప్పటికీ చురుగ్గానే పనిచేస్తున్నారు. ఈ శక్తులు మారీచులుగా మారి అమరావతి నిర్మాణానికి అడుగడుగునా ఆటంకాలు సృష్టించవచ్చు. రాజధాని ప్రాంతంలో అరటి తోటలు తగులబెట్టడం%-% కులం చిచ్చు పేరిట రాష్ట్రంలో రైళ్లను ధ్వంసం చేయడం వంటి సంఘటనలను మళ్లీ చూడాల్సి రావచ్చు. హైసెక్యూరిటీ ఉండే విమానాశ్రయాలలో కోడికత్తులను చూశాం. నట్టింట్లో గొడ్డలి వేటునూ చూశాం. ఇలాంటివి మళ్లీ జరగవన్న గ్యారంటీ ఏమిటి? కులాలపరంగా ఆంధ్రప్రదేశ్ అతి సున్నితమైన రాష్ట్రం. కులం కోసం కత్తులు దూసుకుంటారు. తెలంగాణలో మాదిరి ఈ రాష్ట్రం నాది%-% మాకు రాజధాని లేకపోతే ఎలా? అన్న భావన తక్కువ. ఈ కారణంగానే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతి కొందరిదే అన్న భావనను ఒక వర్గం ప్రజల్లో బలంగా వ్యాపింపజేయడంలో జగన్‌రెడ్డి సక్సెస్ అయ్యారు. ఇప్పుడు ఆయన మళ్లీ ప్రతిపక్షంలో ఉన్నారు. శాసనసభలో సంఖ్యాపరంగా జగన్ బలహీనంగా ఉన్నప్పటికీ కుల, మత అభిమానంతోపాటు రాజశేఖరరెడ్డి కుమారుడన్న అభిమానం కలగలిపి మొత్తం మీద 40 శాతం ప్రజలు ఇప్పటికీ తనకు అండగా ఉన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం అమరావతి నిర్మాణం పూర్తయ్యే వరకు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఎంత మంచి పంట వేసినా దానికి చీడపీడలు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కలుపు మొక్కలను ఏరిపారేయాలి. అప్పుడే పంట చేతికి వస్తుంది. ప్రధాని ఊహించినట్టుగా రాష్ట్ర జీడీపీ అమాంతం పెరగాలంటే అమరావతి నిర్మాణం ఆటంకాలు లేకుండా సకాలంలో పూర్తి కావాలి. ఈ క్రమంలో రాహు కేతువులను

## యుద్ధం మొదలైతే.. పాక్ శతఘ్ని గుండ్లు నాలుగు రోజుల్లో ఖాళీ..!

మొదటిపేజీ తరువాయి

భారత్‌తో యుద్ధం మొదలైతే పాకిస్థాన్ వద్ద శతఘ్ని గుండ్లు కేవలం నాలుగు రోజుల్లో ఖాళీ అయిపోతాయని ఓ ఆంగ్ల వార్త సంస్థ కథనంలో పేర్కొంది. ఆ దేశం వద్ద ప్రస్తుతం అతి తక్కువ స్థాయిలో వీటి నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు సైనిక ఘర్షణల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఈ గుండ్లకు డిమాండ్ పెరగడంతో.. పాక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు వీటిని ఉత్పత్తి చేయడానికి నానా అవస్థలు పడుతున్నాయి. ఇటీవల కాలంలో పాక్ యుద్ధ రిజర్వులు చాలా వరకు ఉక్రెయిన్‌కు విక్రయించడంతో.. దాయాది వద్ద నిల్వలు పడిపోయాయి. ప్రస్తుతం ఉన్నవి కేవలం 96 గంటలకు సరిపోతాయని ఓ నివేదిక వెల్లడించినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం భారత్‌పై పాక్ అనుసరిస్తున్న మోహరింపుల వ్యూహం విజయవంతం కావాలంటే శతఘ్నుల పాత్ర చాలా కీలకం. ముఖ్యంగా ఎం109 హొవిట్జర్లకు 155 ఎంఎం గుండ్లు, బీఎం 21 సిస్టమ్స్‌కు 122 ఎంఎం రాకెట్లు ఆ దేశ సైన్యం రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేస్తాయి. వీటిల్లో 155 ఎంఎం గుండ్లను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేసింది. భారత్ ఎదురుదాడి వ్యూహాన్ని అమలు చేస్తే మాత్రం పాక్ చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా శతఘ్నులు, సెల్ఫ్‌ప్రొపెల్డ్ గన్స్, ఎంజీఎస్ వ్యవస్థల పనితీరు గణనీయంగా పడిపోనుంది.

మరోవైపు పాక్ సైనిక నాయకత్వం తీవ్ర ఆందోళన చెందుతోంది. మే2న జరిగిన ఆ దేశ కోర్ కమాండర్ల సమావేశంలో కూడా ఈ అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక గతంలో పాక్ మాజీ ఆర్మీచీఫ్ ఖమర్ జావెద్ భజ్వా కూడా ఆర్థిక బలహీనత ప్రభావం సైనిక దళాల మందుగుండుపై పడుతున్నట్లు పేర్కొన్నారు. పాక్ తన మందుగుండు నిల్వల కేంద్రాన్ని అత్యవసర స్థితిలో వేగంగా వాడుకునేందుకు భారత్ సరిహద్దుల్లోనే ఏర్పాటు చేసింది.

భారత్‌లో 12 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో జోరుగా ఉత్పత్తి..

మరోవైపు భారత్‌కు చెందిన మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ తన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో ఉత్పత్తిని భారీగా పెంచుతోంది. ఇప్పటికే ఉద్యోగులకు ఇచ్చిన సెలవులను అర్ధంతరంగా రద్దు చేసినట్లు ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలని కోరినట్లు తెలుస్తోంది. వచ్చే రెండు నెలల వరకు రెండ్రోజుల ముందు సమాచారం లేకుండా ఎటువంటి సెలవులు ఉండవని పేర్కొంది. కాకపోతే దీనిపై అధికారికంగా ఎటువంటి సమాచారం బయటకు వెలువడలేదు.

## బోధకులు వద్దు.. భాగస్వాములు కావాలి: జైశంకర్



భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ యూరప్ దేశాధినేతలతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. భారత్‌తో యూరప్ సన్నిహిత సంబంధాలు నెలకొల్పాలంటే స్నేహస్వభావం, పరస్పర ఆసక్తి కలిగి ఉండాలని అన్నారు. ప్రపంచం ఎలా పని చేస్తుందో గమనించాలని సూచించారు. న్యూదిల్లీ ప్రపంచ దేశాల వైపు చూసినప్పుడు బోధకుల కోసం కాకుండా..భాగస్వాముల కోసం ఎదురు చూస్తోందని వ్యాఖ్యానించారు. బోధకులు బయటి వారికి చెప్పే విషయాలను తమ సొంతం దేశంలో పాటించరని జైశంకర్ అన్నారు. యూరప్‌లోని చాలా ప్రాంతాలు ఇప్పుడు అటువంటి సమస్యనే ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

భారత్‌కు యూరప్‌తో దాదాపు 40ఏళ్ల స్నేహబంధం ఉందని..కొన్నేళ్లక్రితం దానితో పలు ఒప్పందాలు చేసుకున్నామని జైశంకర్ పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ నివారణకు మాస్కో ప్రమేయం లేకుండా పశ్చిమ దేశాలు చేసిన పలు ప్రయత్నాలను విదేశాంగ మంత్రి విమర్శించారు. భారత్ ఎల్లప్పుడూ వాస్తవికతను సమర్థిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## 60 చదరపు గజాల్లో కడితేనే ఇందిరమ్మ ఇండ్లకు బిల్లు: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మొదటిపేజీ తరువాయి

60 చదరపు గజాల్లో కడితేనే ఇందిరమ్మ ఇండ్లకు బిల్లు: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

ఇందిరమ్మ ఇండ్లు 60 చదరపు గజాల్లో కడితేనే బిల్లు మంజూరవుతుందన్నారు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. ఇల్లు మంజూరైన నెలలోపే నిర్మాణం ప్రారంభించాలన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ పై రివ్యూ నిర్వహించారు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ఇందిరమ్మ ఇళ్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎంపిక చేయాలని ఆదేశించారు. డబుల్ వెరిఫికేషన్ చేసిన తర్వాతే ఇందిరమ్మ ఇండ్ల లబ్ది దారులను ఎంపిక చేస్తామన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరికీ ఇల్లు మంజూరు చేయబోమన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం అప్పుల పాలయ్యిందన్నారు వివేక్ వెంకటస్వామి. కేసీఆర్ రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని ఫైర్ అయ్యారు. చెన్నూర్ మండలంలోని సోమనపల్లి లో రూ. 250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు ఎమ్మెల్యే వివేక్.

## దక్షిణ తెలంగాణకు గత ప్రభుత్వం అన్యాయం చేసింది: మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి

మిర్యాలగూడ: ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని, ఆగిపోయిన కందమల్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడలో ఉమ్మడి నల్గొండ జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం కేవలం కాళేశ్వరంపైనే ఎక్కువ దృష్టి పెట్టిందని, దక్షిణ తెలంగాణకు చేసిన అన్యాయం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ, దేవాదుల ప్రాజెక్టులను పూర్తి చేయలేదని.. పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమ ప్రాజెక్టులను పట్టించుకోలేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.23వేల కోట్లు కేటాయించినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## మావోయిస్టులతో మాటల్లేవ్.. మాట్లాడుకోడాల్లేవ్.. బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

కరీంనగర్: మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. "తుపాకీతో అమాయకులను చంపేవారితో చర్చలు ఉండవు. మావోయిస్టులతో ఇక మాటల్లేవ్.. మాట్లాడుకోడాల్లేవ్. వారిపై నిషేధం విధించింది కాంగ్రెస్సే. మావోయిస్టులు.. పలు పార్టీల నేతలను మందుపాతరలు పెట్టి చంపారు. ఇన్‌ఫార్మర్ల పేరుతో గిరిజనులను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారు. ఎన్నో గిరిజనుల కుటుంబాలకు మానసిక క్షోభ మిగిల్చారు. తుపాకీ వదిలిపెట్టేవరకు మావోయిస్టులతో చర్చల ఊసే ఉండదు. పాస్‌పోర్టు లేని విదేశీయులను గుర్తించి పంపిస్తున్నాం. రోహింగ్యాలపై తన వైఖరి ఏమిటో కాంగ్రెస్ పార్టీ చెప్పాలి" అని బండి సంజయ్ అన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల మేర ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

సకాలంలో పరీక్షలు నిర్వహించకపోవడంతో పీజీసెట్, లాసెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా సీఎం, మంత్రులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కోహినూర్ వజ్రాన్ని భారత్‌కు తిరిగి ఇచ్చేస్తారా..? బ్రిటన్ మంత్రి ఏమన్నారంటే?

బ్రిటన్ మహారాణి కిరిటంలో పొదివి ఉన్న కోహినూర్ వజ్రం విశిష్ఠత గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. దానిని తిరిగి భారత్‌కు ఇచ్చేస్తారా? అన్న ప్రశ్నకు బ్రిటన్ సాంస్కృతిక, మీడియా, క్రీడల శాఖ మంత్రి లీసా నాండీ బదులిచ్చారు.

దిల్లీ: బ్రిటన్ మహారాణి కిరిటంలో పొదివి ఉన్న కోహినూర్ వజ్రం విశిష్ఠత గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. దానిని తిరిగి భారత్‌కు ఇచ్చేస్తారా? అన్న ప్రశ్నకు బ్రిటన్ సాంస్కృతిక, మీడియా, క్రీడల శాఖ మంత్రి లీసా నాండీ బదులిచ్చారు. భారత్, బ్రిటన్ మధ్య సాంస్కృతిక కళాఖండాల మార్పిడి కోసం ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరుగుతున్నట్లు చెప్పారు. అన్నీ సానుకూలంగా జరిగితే.. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం రావొచ్చని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఇదే అంశంపై భారత్ సాంస్కృతిక శాఖ మంత్రితోనూ చర్చించినట్లు చెప్పారు. అధికారిక పర్యటనలో భాగంగా ప్రస్తుతం లీసా నాండీ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా దిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు.

సృజనాత్మకత, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో భారత్‌లో దృఢమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నట్లు లీసా తెలిపారు. " సినిమా, టీవీ, మ్యూజిక్, క్రీడా రంగాల్లో బ్రిటన్ దూసుకుపోతోంది. ఆయా రంగాలకు సంబంధించిన బ్రిటన్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. భారత్ సహకరిస్తే.. వాటిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ల వచ్చన్న గట్టి నమ్మకం మాకుంది. అందుకు భారత్ కూడా



మద్దతిస్తుందని ఆశిస్తున్నాం" అని లీసా తెలిపారు. భారత్ పర్యటన కోసం శుక్రవారం దిల్లీ చేరుకున్న ఆమె.. సాంస్కృతిక శాఖకు సంబంధించిన పలు ఒప్పందాల గురించి కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో చర్చలు జరుపుతున్నారు.

మరోవైపు పహల్గాం ఉగ్రదాడిపైనా ఆమె స్పందించారు. ఈ దారుణఘటనలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి నివాళులర్పించారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, ఉగ్రవాదం నిర్మూలనకు ప్రపంచదేశాలన్నీ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కాగా, భారత్‌కు చెందిన 108 క్యారెట్ల విలువైన కోహినూర్ వజ్రాన్ని 1849లో మహారాజ్ దులీప్ సింగ్.. విక్టోరియా మహారాణికి ఇచ్చేశారు. అప్పటి నుంచి ఆ వజ్రం వారి ఆధీనంలోనే ఉంది. రాణి కిరీటంలో అమర్చారు. అయితే, దానిని తిరిగి తీసుకోవాలని భారత ప్రభుత్వం దౌత్యమార్గాల్లో ప్రయత్నించినప్పటికీ.. అది కార్యరూపం దాల్చలేదు.

# సంచిక రెండు రూపాయలు ఇస్తేనే ట్రక్ షీట్ తీసుకెళ్తా

**- లేదంటే ఎవరికైనా చెప్పుకోండి అంటున్న లారీ డ్రైవర్**

**- నా పేరు మీద రైతులు పండగ చేసుకోండి అని అహంకారపు మాటలు**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 04 :** రైతు ఆరుగాలం పండించిన అడుగడుగునా గండాలు అన్నట్లు తయారు అయ్యింది వ్యవస్థ. రైతు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల వద్ద ఎన్నో ఇక్కట్లు పడి తూకం వేసిన, రైస్ మిల్లర్లకు తరలించాలంటే సొసైటీ ద్వారా రూ.16 ఖర్చు అవుతుంది. ఇవి కాక లారీలా కొరత సృష్టించి రైతుకు మరింత భారం పెంచేలా చేస్తున్నారు. సొసైటీ ద్వారా లారీలు తెప్పించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాల్సిన అధికారులు మాత్రం నెలలు గడిచిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం మగ్గుతున్న స్పందించడం లేదు. ఎలాగోలా తూకం వేసిన వడ్లు రైస్ మిల్లులకు తరలించడానికి చూస్తుంటే లారీ డ్రైవర్లు మరో రెండు, మూడు రూపాయలు అదనంగా ఇవ్వాలని, లేదంటే ట్రక్ షీట్ తీసుకెళ్ళమని, వడ్లు ఇక్కడే వదిలేస్తనని, వర్షం పడితే పాలిథిన్ కవర్ కప్పనని రైతులను ఇబ్బందులకు గురి చేసిన ఘటన ధర్పల్లి మండలం హొన్నాజీ పేట్ సొసైటీ వాడి కొనుగోలు కేంద్రం లో శనివారం అర్ధరాత్రి జరిగింది. ప్రతి కొనుగోలు కేంద్రాలలో రైతులు మూడు రూపాయలు ఇస్తున్నారు. తప్పకుండా ఇవ్వాలని అర్ధరాత్రి రైతులతో వాధించాడు. మాకు సొసైటీ వారు డబ్బులు ఇవ్వాలని చెప్పలేదని మాట్లాడితే.. సొసైటీ సీఈఓ నాకు సంచికి రెండు, మూడు రూపాయలు ఇప్పిస్తానని చెప్పాడు. నా దగ్గర రికార్డింగ్ కూడా ఉందని బుకయించాడు. ఇంతల రైతులను మోసం చేస్తున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తోంది. లోడ్ చేయి అనంతరం అర్ధ రాత్రి ఫోన్ చేయించి, ఇంటికి వెళ్లి పడుకున్న తరువాత డబ్బులు ఇస్తారా లేదా ట్రక్ షీట్ ఇక్కడే విడిచి పెట్టీ పోతా మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని అహంకారపు మాటలు మాట్లాడడం జరిగింది. డ్రైవర్ కు కావాలంటే అరుగురు (6) రైతులం కలసి చాయి పానీ కోసం తలో రెండు వందలు ఇస్తామని చెప్పిన, అవసరం లేదు. మీ రైతులు ఆ డబ్బులతో పండగ చేసుకోండి అంటూ నోటి కొచ్చిన మాటలు మాట్లాడడం జరిగింది. నా పేరు పలానా ఎవరికైన చెప్పుకోండి. మీ వడ్లు నా లారీ లో ఉన్నాయని బెదిరింపులకు పాల్పడ్డాడు. కొనుగోలు కేంద్రంలో ఉన్న సిబ్బంది చెప్పిన వినకుండా కోపంతో ట్రక్ షీట్ తీసుకొని లారీ ని ప్రారంభించి, తిట్టుకుంటూ స్పీడ్ గా వెళ్లి పోయాడు. ఇంత జరుగుతున్నా అటు జిల్లా అధికారులు గాని, ఇటు సొసైటీ వారు గాని స్పందించక పోవడం గమనార్హం.

# దరువు అంజన్నకు గద్దర్ ఐకాన్ 2024 అవార్డు ప్రదానం




**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) మే 04 :** గద్దర్ ప్రపంచ చరిత్రలో నిలిచిపోయాడని అతని బ్రతుకంతా ప్రజలతోనే గడిపాడని దళిత బహుజన వాడల్లో వెలుగైనాడని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు, సాయి అలేఖ్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భాస్కర ఆడిటోరియంలో జరిగిన గద్దర్ ఐకాన్ అవార్డ్స్ 2024 ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు, కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ చేసిన సేవలను గుర్తించి ఆయన పేరు మీద గద్దర్ అవార్డులు ఇస్తుందని ఆయన గుర్తు చేశారు, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం మా నాన్న త్యాగాలను గుర్తించి గద్దర్ అవార్డుల పేరున గొప్ప కార్యక్రమం చేపట్టడం హర్షనియమన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు పెద్దపీట వేస్తుందని అన్నారు, టూరిజం శాఖ చైర్మన్ పటోళ్ల రమేష్ రెడ్డి మాట్లాడుతూ గద్దర్ చేసిన సేవలు మరువలేవని ఆయన పేరుమీద అవార్డు ఇవ్వడం హర్షించదగ్గ విషయమని అన్నారు, సాయి అలేఖ్య సాంస్కృతిక సంస్థను అభినందించారు , ప్రజా గాయని విమలక్క మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన ఇంతమంది కళాకారులను గుర్తించడం చాలా హర్షించదగ్గ విషయమని అన్నారు, టూరిజం శాఖ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ సాయి అలేఖ్య సాంస్కృతిక సంస్థ కళాకారుల పట్ల ఎంతో శ్రద్ధ వహించి వారిలో నిగూఢమైనటువంటి కళను వెలికి తీసే ప్రయత్నం చేస్తుందని వారి సేవలు అభినందనీయమన్నారు. సభకు వేణుగోపాల చారి అధ్యక్షత వహించారు, సీ ఎల్ యాదగిరి, చైతన్య పాటశాలల చైర్మన్ శివరాత్రి యాదగిరి, వీర భోగ వసంత రాయులు అతిథులుగా పాల్గొన్నారు,

ఇందులో భాగంగా ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన అరుణ అశోక్ దంపతులను ముఖ్య అతిథులు శాలువా కప్పి సత్కరించారు, అవార్డు గ్రహీత దరువు అంజన్న మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తాను చేసిన త్యాగాన్ని గుర్తించి గద్దర్ ఐకాన్ అవార్డు 2024 కు ఎంపిక చేసిన సాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ చైర్మన్ అరుణ గారిని పేరుపేరునా అభినందించారు, గద్దర్ అవార్డు అందుకోవడం చాలా గర్వంగా ఉందని అన్నారు ఈ సందర్భంగా కళాకారులు పాడిన పాటలు అలరించాయి.

# నేటి నుండి మెండోరా మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సులు

**- రెండు రెవెన్యూ బృందాల నియామకం**

**- ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సదస్సులు**

**- అందుబాటులో హెల్ప్ డెస్క్, వెరిఫికేషన్ బృందాలు**

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 04 :** ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా పైలట్ ప్రాతిపదికన జిల్లాలోని మెండోరా మండలాన్ని ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సదస్సుల నిర్వహణ కోసం రెండు రెవెన్యూ బృందాలను నియమించామని అన్నారు. ఈ బృందాలు షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అందుబాటులో ఉంటూ భూ సంబంధిత సమస్యలపై రైతులు, ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని అన్నారు. ప్రతి రోజు ఒక్కో బృందం ఒక గ్రామం చొప్పున రోజుకు రెండు గ్రామాలలో సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని వివరించారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి సహకారం అందించేందుకు వీలుగా హెల్ప్ డెస్క్ బృందాలను, దరఖాస్తులను వెంటదివెంట పరిశీలన జరిపేలా వెరిఫికేషన్ బృందాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 5న చాకిర్యాల, కొడిచెర్ల గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వివరించారు. 6వ తేదీన బుస్సాపూర్, మెండోరా గ్రామాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, 7వ తేదీన వెల్గటూర్ జడ్పీ హైస్కూల్, సావెల్ గ్రామ పంచాయతీలలో, 8న దూదిగాం సీఎస్ఐ స్కూల్, సోన్ పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని అన్నారు. భూ సమస్యలు కలిగిన రైతులు, ప్రజలు ఈ సదస్సులను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ప్రశాంతంగా నీట్ పరీక్ష పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాం

**- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**




**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) మే 04 :** ప్రశాంతంగా నీట్ పరీక్ష పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు.ఆదివారం జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూలో ఏర్పాటుచేసిన నీట్ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ పరిశీలించారు.జిల్లాలో మొత్తం 758 పరీక్ష విద్యార్థులు పరీక్షలు రాశారని. మొదటి సెంటర్లో 480, రెండవ సెంటర్లో 278,ఎగ్జామ్ రాశారని తెలిపారు.రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు.మొదటి పరీక్ష కేంద్రంలో 13 మంది ఆబ్సెంట్.రెండవ పరీక్ష కేంద్రంలో ఐదుగురు ఆబ్సెంట్ అయ్యారని.మొత్తం 18 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు.విద్యార్థులు మొత్తం 740 మంది పరీక్ష రాశారని జిల్లా కలెక్టర్ తెలిపారు

## ఉచిత కంటి పరీక్షల క్యాంప్ ను ప్రారంభించిన పోలీస్ కమిషనర్





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 04 :** పోలీసులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని సీపీ సాయి చైతన్య సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో పోలీస్ శాఖ,

ఫీనిక్స్ ఫౌండేషన్ శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సీపీ మాట్లాడుతూ.. విధుల్లో ఉంటూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టకపోవడంతో పలువురు సిబ్బంది రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ ఆర్నెళ్ల కొకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. సుమారు 450 మంది పోలీసులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రొబేషనరీ ఐపీఎస్ సాయికిరణ్ , అదనపు డీసీపీ (ఏఆర్) రామచందర్ రావు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, అడ్మిన్(ఏసీపీ) మస్తాన్ అలీ, రిజర్వ్ ఇన్స్పెక్టర్ శేఖర్ బాబు, సతీష్, పోలీస్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ సరళ తదితరులు పాల్గొన్నారు.

### బాలింత కడుపులో బ్యాండేజీ.. కమలాపూర్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం

బాలింత కడుపులో నుంచి బయటకు తీసిన బ్యాండేజీ

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. వారం క్రితం మహిళకు సిజేరియన్ చేసి ప్రసవం చేసిన కమలాపూర్ ఆస్పత్రి వైద్యులు.. కడుపులో బ్యాండేజి ఉంచి అలాగే కుట్లు వేశారు. దీంతో బాలింతకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. మరోసారి ఆస్పత్రికి రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. విధుల్లో ఉన్న నర్సుకు ఫోన్ చేసిన వైద్యురాలు.. బ్యాండేజ్ ఎలా తీయాలో ఫోన్‌లోనే వివరించారు.

## అభివృద్ధి పథంలో బోడుప్పల్ 15వ,డివిజన్

- బాలాజీ నగర్- బొల్లిగూడెం నూతన సిసి రోడ్డు పనులు ప్రారంభం
- సుమారు 35లక్షల నిధులతో సిసి రోడ్డు పనులు ప్రారంభం.
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న కొత్త దుర్గమ్మ పాండు గౌడ్,కొత్త కిషోర్ గౌడ్



**హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ (మన వెలుగు) మే 04 :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ అభివృద్ధిలో దూసుకుపోతుంది.డివిజన్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ – బొల్లిగూడెం ప్రధాన రహదారి నూతన సిసి రోడ్డు పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా 15వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ పాండు గౌడ్,మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ పాల్గొని పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా కొత్తదుర్గమ్మ పాండు గౌడ్ మాట్లాడుతూ పదవితో సంబంధం లేకుండా ప్రజల సంక్షేమం,డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని సుమారు 35 లక్షల నిధులతో బాలాజీ నగర్–బొల్లిగూడెం నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించామని,అతి త్వరలో పనులు పూర్తి పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,కాలనీవాసులు,మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పదో తరగతి స్టేట్ ట్రాపర్ ని సన్మానించిన అర్బన్ ఎమ్మెల్యే





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 04 :** ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 596 మార్కుల సాధించిన స్టేట్ టాపర్ గా నిలిచిన కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థిని ఎస్. కృతి ని అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ సన్మానించారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా విద్యార్థిని రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్ సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు, జిల్లాకు, కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిందని కొనియాడారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత లక్ష్యాలను సాధించి ఇందూర్ జిల్లాకు గర్వకారణంగా నిలవాలని ఆశీర్వదించారు పది పరీక్షల్లో తక్కువ మార్కులు సాధించి, పేయిల్ అయినా విద్యార్థులలొ మనోస్థైర్యం నింపాలని వారిని మానసిక ఆందోళనకు గురికాకుండా విజయం దిశగా అడుగులు వేసేలా ఉపాధ్యాయులు, తల్లి, తండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ధన్ పాల్ లక్ష్మి భాయ్ విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా విద్య అందిస్తున్న వారికి ఈ సంవత్సరం పదో తరగతి మొదటి శ్రేణిలో పాసైన విద్యార్థులు ఉండటం సంతోషంగా ఉందన్నారు. పేద విద్యార్థుల చదువుల కు ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ సిహెచ్ రామోజీరావు, కాకతీయ విద్యాసంస్థలు ప్రిన్సిపల్ రణదీష్,
తదితరులు పాల్గొన్నారు

## విదేశీ పర్యటనకు అనుమతి ఇచ్చిన సిబిఐ కోర్టు

**- 16 న అమెరికా కు కల్వకుంట్ల కవిత**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 04** బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు అమెరికా వెళ్లేందుకు ఢిల్లీలో రౌస్ ఎవెన్యూ సీబీఐ కోర్టు అనుమతిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 16న అమెరికాలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనడానికి కోర్టు అనుమతి కోరగా అనుమతి మంజూరు చేసింది. ఈ నెల 16 నుంచి 23 వరకు కవిత దంపతులు అమెరికా వెళ్లనున్నారు.

# ఒక్కఇల్లు లేదు... బాబోయ్

- దళితులను మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- అంతా నా ఇష్టం లోకల్ లీడర్
- నేనే సీఎం నేనే పిఎం అంటున్న ఇందిరమ్మ కమిటీ
- అనర్హులకు ఇల్లు కేటాయింపు
- నీ ఇష్టం వచ్చిన చోట చెప్పుకో అంటున్నా స్థానిక నాయకుడు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పటిష్టాత్మకంగా నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి కల పేదవాడికి నిరాశే మిగిల్చింది, పేదవాడి కన్నీటికి కారణం అవుతున్న కాంగ్రెస్ పార్టీ నిలువెత్తు నిదర్శనం అని చెప్పవచ్చు, అర్హతతో సంబంధం లేకుండా నా తొత్తులకే ఇస్తాను అన్న ప్రస్తావన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం చిన్న గొల్లగూడెం గ్రామంలో చోటుచేసుకుంది ప్రస్తుతానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోకొచ్చి ఏడాది దాటి పోతున్న కొన్ని పథకాలు మాత్రం ఆమడ దూరంలోనే ఉండిపోయాయి మరికొన్ని అయితే కనపడిన దాఖలాలే లేకున్న పోయినవి కొన్ని పథకాలు విషయంలోకొస్తే ఉచిత బస్సు పథకం అది ఎవరికి ఉపయోగపడుతుందో తెలియదు కానీ బస్సు ప్రయాణాల్లో మహిళలు కొట్లాడూకునే సందర్భాలు ప్రతిరోజు చూస్తూనే ఉన్నాం బస్సుల్లో ప్రయాణించేది కేవలం పేదవాడే డబ్బులు ఉన్న వ్యక్తి దర్జాగా తన సొంత వాహనంలో ప్రయాణం చేస్తూ ఉంటాడు ఉచిత బస్సు స్కీము మాత్రం పేదవాళ్లు కొట్లాట కోసమా అన్న తరుణంలో రాష్ట్రమంతా చర్చిని అంశంగా మారింది అందులో భాగంగానే రైతుబంధు కావచ్చు రుణమాఫీ కావచ్చు రుణమాఫీ కానీ రైతులు అనేకమంది రోడ్డు ఎక్కి గోడువెళ్ల పుచ్చుకున్న సంఘటనలు రాష్ట్రంలోనూ అనేకంగానే ఉన్నాయి, వారి వాదన పట్టించుకున్న నాధుడే లేడు అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ నిమ్మకు నీరెట్టినట్లుగా తుమ్మ ముద్దు లెక్క కదలకుండా దున్నపోతు పై వర్షం పడటం మాదిరిగా నన్ను కాదు అన్న తరహాలో వారి పనులు వారు యధావిధిగా కొనసాగిస్తున్నారు అవన్నీ ఒక ఎత్తుగా మారితే ఇందిరమ్మ గృహ పథకం మరో ఎత్తుగా మారింది గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసుకొని కమిటీ అధ్యక్షులు కి వారికి సంబంధించిన వారికి అర్హత లేకపోయినా అధికార ప్రజాప్రతినిధుల అండదండాల తోటి వారి ఇష్టానుసారంగా చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవ స్థానిక శాసనసభ్యులు కు మంత్రివర్యులకు అధికార కాంగ్రెస్ పార్టీకి తీర్చలేని మచ్చని వెల్లుబుచ్చుతున్న తరణం చిన్నగొల్లు గూడెంలో చర్చిని అంశంగా మారింది

ఇది నిజమైన సర్వేన అంటూ స్థానికులు గ్రామస్తులు ఆశ్చర్యంలో ఉండిపోయారు

తొలి జాబితాలో ఒక్క దళితుల పేర్లు కూడా రాకపోవడంపై కమిటీ సభ్యులు పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి

స్థానికంగా ఉన్న ఇందిరమ్మ కమిటీ సొమ్ములు కి కక్కుర్తి పడి ఏమన్నా మార్చారా....?

లేక ముఖ్యమంత్రివర్యులు/శాసనసభ్యులు దళితులను వద్దనుకున్నారా....?

ప్రతి గ్రామంలోనూ ఇందిరమ్మ కమిటీ నిర్ణయించిన వారికి ఇల్లు అన్న చర్చలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి

చిన్న గొల్లగూడెం లో కూడా అదే జరుగుతుందా......?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదవానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలి అన్న ఆలోచన మంచిదే అయినప్పటికీ దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన మారింది ఏది ఏమైనాప్పటికీ కొన్ని గ్రామాల్లో కొన్ని పంచాయితీలులో

మీరు ప్రారంభిస్తే....!

మేము బిల్లులు చేస్తాం...??

అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి

చిన్న గొల్లగూడెంలో ఒక్క దళితులకు కూడా ఇందిరమ్మ ఇల్లు రాకపోవటంతో ఒక్కసారిగా కాంగు తిన్నంత పనైంది

దళితులందరూ ఆశ్చర్యం లోనే ఉండిపోయారు

ఇందిరమ్మ ఇంటి కల మా దళిత కుటుంబాలను నిరాశే మిగిల్చిందంటూ మీడియా ముందు గోడుగులు పోసుకున్నారు

ఈసారికైనా మారతాయన్న మా బ్రతుకులు కావాలని స్థానిక పరిపాలనలో ఉన్న వారు బురదలో పెట్టి తొక్కారు అంటూ దీర్ఘాయ గతి స్థితిలోకి వెళ్లిపోయారు

వ్యక్తిగత కక్షలతో పేర్లు మాయం చేశారా...

లేక దళితుల పేర్లు మరిచారా....

వీరు ఆపారా...

వారు ఇవ్వలేదా..

అన్న ప్రశ్నలు దమ్మపేట మండలంలో చెక్కర్లు కొడుతున్నాయి

దయచేసి దళితుల్ని కూడా గుర్తించండి పేదవాడినీ గుర్తించి నిజమైన సర్వే సక్రమంగా చేసి అర్హులైన పేదవారికి ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు

## నీట్ -2025 పరీక్షా కేంద్రాలను పరిశీలించిన పోలీస్ కమీషనర్

- పరీక్షా కేంద్రాల వద్ద 163
- బి న్ స్ స్ అమలు
- ప్రశాంత వాతావరణంలో నీట్ పరీక్ష నిర్వహణ

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 04 :** నిజామాబాదు లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ మరియు గిరిరాజు ప్రభుత్వ కాలేజీ పీజీ బ్లాక్ లను పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, బందొబస్త్ ఏర్పాట్లు, పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష సరళి పరిశీలించారు.






ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పోలీస్ కమీషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ జిల్లాలో నీట్ పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకి ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి న్ స్ స్ అమల్లో ఉన్నందున ఎవరు గుంపులుగా ఉండకుండా చూడాలని, పోలీసు అధికారులకి సిబ్బందికి సూచించారు. బాధ్యతగా పని చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష పత్రాలు స్ట్రాంగ్ రూముకు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడం జరుగుతుంది అన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జై.మ్. శ్రీనివాస్, పీజీ బ్లాక్ ఇంచార్జి డిప్యూటీ సీస్,డాక్టర్. కె. రంజిత, టౌన్ 3 పోలీస్ స్టేషన్ ఎస్ఐ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 04 :** భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఈ వేడుకలకు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధ్యక్షత వహించగా, వివిధ శాఖల అధికారులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆనాడు భగీరథుడు ఘోర తపస్సు ద్వారా అవిశ్రాంతంగా కృషి చేసి ఆకాశ గంగను ఆకాశం నుండి భూమికి తెచ్చాడని పురాణ ఇతిహాసాలలో పేర్కొనబడిందని అన్నారు. ఏదైనా కష్టమైన కార్యం సాధించాలంటే మహర్షి భగీరథుడి





కృషిని ప్రస్తావిస్తూ, ఆ స్ఫూర్తితో ముందుకు సాగాల్సిందిగా ఇప్పటికీ పెద్దలు సూచిస్తారని గుర్తు చేశారు. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో సమాజ హితానికి పాటుపడేందుకు వీలుగా ప్రభుత్వం మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా మహనీయుల ఆలోచనా విధానాలతో నేడు మనమంతా ముందుకు సాగితే సమాజం సత్వర అభివృద్ధి సాధించేందుకు, రుగ్మతలు దూరం అయ్యేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారిణి స్రవంతి, సహాయ అధికారి నర్సయ్య, బీసీ సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉప్పల్ రింగ్‌రోడ్డు వద్ద కారులో మంటలు.. భారీగా ట్రాఫిక్ జామ్



హైదరాబాద్: నగరంలోని ఉప్పల్ రింగ్ రోడ్డులో వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నాగోలు నుంచి తార్నాక వైపు వెళ్తున్న కారు ఇంజిన్‌లో పొగలు రావడంతో అందులో ఉన్నవారు అప్రమత్తమై బయటకు దిగారు. వారంతా బయటకు వచ్చిన నిమిషాల వ్యవధిలోనే కారు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. అదే మార్గంలో వెళ్తున్న వాహనదారులు ఒక్కసారిగా చెలరేగిన మంటలను చూసి భయాందోళనకు గురయ్యారు. రహదారికి మధ్యలో ప్రమాదం జరగడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. ఉప్పల్ నుంచి తార్నాక మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేసే లోగా కారు పూర్తిగా దగ్ధం అయింది.

# విద్యుత్ వైర్ తెగిపడి భారీ ప్రమాదం

**గొల్లపెల్లి (మన వెలుగు) మే 04 :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం రోజు 11 కె.వి విద్యుత్ వైరు తెగిపడి మంటలు చెలరేగడంతో భారీ ప్రమాదం చోటు చేసుకుంది. గొల్లపల్లి నుండి వెనుగుమట్ల వెళ్లే 11 కేవీ విద్యుత్ వైరు మండల కేంద్రంలోని అర్చనపెల్లి పద్మ ఇంటి దగ్గర తేగి కింద పడడం తో ఒక్కసారిగా మంటలు చెలరేగడం తో టాటా ఏసి టీఎస్ 16 యూఏ 0129,స్కూటీ తో పాటు ఇంటి ఆవరణలో అరబోసిన 30 క్వింటాల మొక్కజొన్న పూర్తిగా కాలి పోయాయి.దీంతో స్థానికులు అప్రమత్తమై విద్యుత్ సరఫరాను ఆపివేసి మంటలను సకాలంలో ఆర్పి వేయడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ ఘటన లో తమకు సుమారు 10 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు పద్మ తెలిపారు.గతంలో పలుమార్లు 11కేవీ వైరు తెగిపడిన ఘటన చోటుచేసుకుందని స్థానికులు వెల్లడించారు.



## అంకాలమ్మ తల్లి ఆశీస్సులు మెండుగా ఉండాలి

**95 న్యూస్ ప్రతి నిధి మురళి నెల్లూరు జిల్లా,,**







అంకాలమ్మ తల్లి ఆశీస్సులు జిల్లా ప్రజలపై మెండుగా ఉండాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు ఆకాంక్షించారు. వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామంలోని గ్రామ దేవత శ్రీ అంకాలమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ట మరియు కుంభాభిషేకంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గారితో కలిసి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో వేదపండితులు ఘన స్వాగతం పలికారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్,కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్ గార్లతో కలిసి అమ్మవారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన గ్రామస్తులను ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు ప్రత్యేకంగా అభినందించారు. అంకాలమ్మ తల్లి ఆశీస్సులతో పెద్దిరెడ్డిపల్లి గ్రామం సుభిక్షంగా వుండాలని కోరారు. ఆలయ పునర్నిర్మాణానికి ముందుకొచ్చిన గ్రామస్తులు, దాతలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గారు అభినందనలు తెలియచేసారు. అమ్మవారిని దర్శించుకోవడం తన పూర్వజన సుకృతంగా భావించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా మోమిన్ పెట్ మండలం కెపిఆర్ గార్డెన్ లో మాలే అనంతయ్య కూతురు వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్, రత్నం ,ప్రేమ్ కుమార్, వెంకటేష్ మాలె శ్రీనివాస్,మోరంగ పల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పందించారు.... ప్రాణాలు నిలిపారు

**బీర్ పూర్ (మన వెలుగు) మే 04 :** నిర్మల్ జిల్లాకి చెందిన గణపతి బీర్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోల్ల వాగు దగ్గర పీతలు పట్టడానికి వచ్చి పాముకాటుకు గురికాగా అర్ధరాత్రి సమయంలో డయల్ 100 ద్వారా పోలీసులను సంప్రదించగా వెంటనే స్పందించిన బీర్పూర్ ప్రొబిషనరీ ఎస్ఐ రాజు తమ సిబ్బంది తో కలిసి పాముకాటుకు గురైన వ్యక్తిని అటవీ ప్రాంతం నుండి సురక్షితంగా 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది.ఆపద సమయంలో వెంటనే స్పందించి ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడినందుకు ప్రొబిషనరీ ఎస్ఐ రాజు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.



# మిమ్మల్ని ఎక్కువ ప్రేమించేది వాళ్లే!




మీరు ఎవరితో స్నేహం చేస్తారో వారితో జాగ్రత్తగా ఉండండని అంటోంది కథానాయిక రష్మిక. తెరపై తన నటనతో సినీప్రియుల్ని మెప్పించే ఈ భామ.. సామాజిక మాధ్యమాల్లోనూ ఫొటోలు పంచుకుంటూ, సలహాలిస్తూ చురుకుగానే ఉంటుంది. తాజాగా ఈమె ఇన్‌స్టా వేదికగా తల్లిదండ్రులను గౌరవించండి అంటూ ఓ పోస్ట్ పెట్టింది. "ఇది మీ కోసమే. ఈ ప్రపంచంలో ఎవరూ చెడ్డవారు కాదు కానీ.. వారు మీకు మంచి వ్యక్తి కాకపోవచ్చు. ఈ రోజు స్నేహితులుగా ఉన్న వ్యక్తులు రేపు మీ మిత్రులు కాకపోవచ్చు. లేకపోతే వారే జీవితాంతం మీకు తోడుగా ఉండవచ్చు. అది మీరు ఎంపిక చేసుకునే విధానంపై ఆధారపడి ఉంటుంది. మీ తల్లిదండ్రులను గౌరవించండి. వారు ఈ ప్రపంచంలోనే మిమ్మల్ని ఎక్కువగా ప్రేమిస్తారు. వారి మాటలను వినండి. మంచి ఎంపిక చేసుకోవడానికి వారి సహాయం తీసుకోండి. ఎప్పుడూ తల్లిదండ్రులను తేలికగా తీసుకోవద్దు" అని ఆ పోస్ట్‌లో రాసుకొచ్చింది. సినిమాల విషయానికొస్తే... ప్రస్తుతం రష్మిక జాబితాలో 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'థామా' తదితర చిత్రాలున్నాయి.

# స్టైల్ స్టైల్‌గా...



అల్లు అర్జున్‌ని 'పుష్ప' సినిమాలు ఐకాన్ స్టార్‌ని చేసేశాయి. అంతకుముందు ఆయన్ని స్టైలిష్ స్టార్ అని పిలిచేవారు. అందుకు తగ్గట్టే ప్రతి సినిమాకీ ఓ కొత్త రకమైన స్టైల్‌తో దర్శనమిచ్చేవారు. 'పుష్ప' పాత్ర కారణంగా దాదాపు ఐదేళ్లపాటు గుబురు గడ్డం, జుట్టుతోనే కనిపించాల్సి వచ్చింది. ఆ పాత్ర నుంచి బయటికి వచ్చాక మళ్లీ అల్లు అర్జున్ మునుపటిలా స్టైల్‌గా మారిపోయారు. కొత్త సినిమాలో ఎలాంటి లుక్‌లో కనిపిస్తారో ఇంకా స్పష్టత లేదు. చిత్రీకరణ ప్రారంభానికి ఇంకా చాలా సమయం ఉంది. ఒక దఫా లుక్ టెస్ట్ అయితే జరిగింది. ఇంకా తుది నిర్ణయానికైతే రాలేదని సమాచారం. అయితే అల్లు అర్జున్ మాత్రం బయట కొత్త రకమైన స్టైల్‌తో కనిపిస్తూ ఊరిస్తున్నారు. వేవ్స్ సమ్మిట్‌లో ఆయన లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన తదుపరి చిత్రం అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. అందులో భిన్నరకాల లుక్స్‌లో ఆయన సందడి చేస్తారని తెలుస్తోంది.

# నా మాటల వెనక ఉద్దేశం అదే!



ఏ వర్గాన్నీ, తెగనీ బాధపెట్టడం తన ఉద్దేశం కాదనీ... ఎవరిపైనా తాను వివక్ష చూపలేదన్నారు యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ. తాను చేసిన వ్యాఖ్యలతో ఎవరైనా బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేస్తున్నానని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన 'రెట్రో' వేడుకలో తెగలు, సమూహాల గురించి ఆయన చెప్పిన మాటలపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వీటిపై విజయ్ దేవరకొండ స్పందిస్తూ ఓ ప్రకటనని విడుదల చేశారు. "మానవ జాతి తొలినాళ్లల్లో మనమంతా తెగలు, సమూహాలుగా ఉండేవాళ్లమనే చెప్పాను తప్ప, మన షెడ్యూల్డ్ తెగల గురించి మాట్లాడటం నా ఉద్దేశం కాదు. షెడ్యూల్డ్ తెగలు అంటే నాకు ఎంతో గౌరవం, ప్రేమ. వాళ్లందరినీ నా కుటుంబంగా, నా సోదరుల్లా చూస్తాను. భారతదేశ ప్రజలంతా ఒక్కటే. మనందరం కలిసి కట్టుగా ముందుకు సాగాలని కోరుకుంటాను" అంటూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# 'స్వాగ్' విషయంలో బాధపడలేదు.. ఎందుకంటే : శ్రీవిష్ణు



శ్రీవిష్ణు ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ మూవీ '#సింగిల్'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఆయన పలు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. '#సింగిల్' విశేషాలతోపాటు తన గత చిత్రం 'స్వాగ్' రిజల్ట్ గురించి ఆయన మాట్లాడారు. 'స్వాగ్' రిజల్ట్ విషయంలో తాను ఏమీ బాధపడలేదన్నారు. మరికొంత కలెక్షన్స్ వస్తే నిర్మాత మరింత ఆనందించేవారన్నారు."'స్వాగ్' విషయంలో నేను ఏమీ నిరాశకు గురి కాలేదు. ఎందుకంటే, ఆ సినిమా నాకెంతో గుర్తింపు, పేరు వచ్చింది. రూ.100 కోట్ల బడ్జెట్‌తో సినిమా చేసినా అంత పేరు రాదేమో. నిజం చెప్పాలంటే, నేను కలెక్షన్స్ కంటే గుర్తింపునకే ప్రాధాన్యత ఇస్తుంటా. ఓటీటీలో విడుదల తర్వాత మిగిలిన రాష్ట్రాల్లోనూ నాకెంతో పేరు లభించింది. ఇంకాస్త ఎక్కువ కలెక్షన్స్ వచ్చి ఉంటే మా నిర్మాత మరింత సంతోషించేవారు" అని శ్రీవిష్ణు తెలిపారు. 'స్వాగ్'కు ముందు వచ్చిన చిత్రాలు రెండు ఎంటర్‌టైన్‌మెంట్ జానర్‌లో ఉండటం వల్ల ప్రేక్షకులు దీనిని కూడా వినోదాత్మక చిత్రమే అనుకున్నారని ఆయన తెలిపారు. గత చిత్రాలతో పోలిస్తే ఇందులో డ్రామా ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని తాము ప్రేక్షకులకు తెలియచేయలేకపోయమన్నారు.అనంతరం ఆయన సింగిల్ గురించి మాట్లాడారు. "సింగిల్‌కు ముందు హ్యాష్‌ట్యాగ్ పెట్టడానికి కారణం ఉంది. సినిమా చూస్తే అది తెలుస్తుంది. 'సామజవరగమన' సమయంలోనే ఈ కథ నా వద్దకు వచ్చింది. దర్శకుడు తమిళనాడుకు చెందిన వ్యక్తి. దాంతో అతను కొన్నినెలల పాటు వర్క్ చేసి ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ప్రేక్షకులను అలరించాలనే ఉద్దేశంతోనే ఈ సినిమాలో కొన్ని సోషల్‌మీడియాలో వైరల్ మూమెంట్స్‌ను రీ క్రియేట్ చేశాం. ఓ సీన్ విషయంలో వివాదం నెలకొంది. ఇతరులను కించపరచాలనే ఉద్దేశం మాకు ఏమాత్రం లేదు. ఆ వివాదాన్ని సాగదీయడం మాకు ఇష్టం లేదు. అందుకే మేము వెంటనే 'కన్నప్ప' టీమ్‌కు క్షమాపణలు చెప్పాం" అని ఆయన వివరించారు. మే 9న ఈచిత్రం విడుదల కానుంది. కేతికా శర్మ, ఇవానా కథానాయికలు.

# నటిగా ఇంతకంటే ఆనందం ఏముంది



"వినోదం నిండిన ప్రేమకథతో రూపొందిన చిత్రం 'సింగిల్'. కుటుంబంతో కలిసి హాయిగా థియేటర్స్‌లో ఆస్వాదించేలా ఉంటుంది" అంది నటి ఇవానా. విజయవంతమైన తమిళ అనువాద చిత్రం 'లవ్‌టుడే'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆమె.. ఇప్పుడు 'సింగిల్'తో తెలుగులోకి తొలి అడుగు వేయనుంది. శ్రీవిష్ణు హీరోగా కార్తీక్ రాజు తెరకెక్కించిన చిత్రమిది. అల్లు అరవింద్ సమర్పణలో ముస్తాబైన ఈ సినిమా ఈనెల 9న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది ఇవానా. "ఇది పూర్తిగా వినోద ప్రధానంగా సాగే సినిమా. ఆద్యంతం చక్కటి నవ్వుల ప్రయాణంలా ఉంటుంది. నేనిందులో హరిణి అనే డ్యాన్సర్‌గా కనిపిస్తా. తప్పకుండా అందరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది. నా పాత్ర ప్రేక్షకుల్లో ఓ ఆసక్తి రేకెత్తిస్తుంది"."గీతా ఆర్ట్స్ లాంటి ప్రతిష్ఠాత్మక చిత్రంలో నా తొలి తెలుగు సినిమా చేసే అవకాశం రావడం నాకెంతో ఆనందాన్నిచ్చింది. సెట్లో శ్రీవిష్ణు చాలా సైలెంట్‌గా ఉంటారు. కానీ, వెన్నెల కిశోర్‌ను కలిసినప్పుడు చాలా హిలేరియస్‌గా కనిపిస్తారు. వీలైనంత వరకు సెట్లో తెలుగులో మాట్లాడటానికే ప్రయత్నించా. తెలుగు చాలా అందమైన భాష"."లవ్ టుడే'లోని బుజ్జి కన్నా అనే నా పాత్ర పేరుతో ఇక్కడి ప్రేక్షకులు నన్ను పిలవడం ఆనందాన్నిస్తోంది. ఒక పాత్ర పేరుతో ఇలా అందరికీ గుర్తుండటం ఓ నటికి ఇంతకంటే ఆనందం మరొకటి ఏం ఉండదు".

# కారు యాక్సిడెంట్.. ఆ ఒక్క రాత్రి నన్నెంతో మార్చేసింది: నాని



తనకు గతంలో జరిగిన ఓ కారు ప్రమాదం గురించి నటుడు నాని తాజాగా వెల్లడించారు. ఆ ప్రమాదం తర్వాత తాను జీవితాన్ని చూసే కోణంలో ఎంతో మార్పు వచ్చిందన్నారు."కారు కొనుగోలు చేయడానికి కంటే ముందే నాకొక రోడ్డు ప్రమాదం జరిగింది. నా ఫ్రెండ్ కారు తీసుకుని స్నేహితులతో కలిసి హైవేపై డ్రైవ్‌కు వెళ్లా. రోడ్డుపై నిలిపిఉంచిన లారీని మా వాహనం ఢీకొట్టింది. రాత్రి సమయం కావడంతో చీకట్లో ఏమీ కనిపించని స్థితి. రోడ్డు మధ్యలో ఆగి ఉన్న లారీని గ్రహించేలోపు మా కారుకు జరగాల్సిన ప్రమాదం జరిగింది. లారీ వెనుక భాగం మా కారులోకి చొచ్చుకొచ్చింది. అద్దం ముక్కలు కావడంతో నా శరీరం మొత్తం రక్తం. నా పక్క సీట్‌లో ఉన్న స్నేహితుడు స్పృహ కోల్పోయాడు. ఏదో ఒక రకంగా ఆ కారు నుంచి బయటపడ్డాం.మేము అంబులెన్స్‌లో ఆస్పత్రికి వెళ్తున్న సమయంలో మరో యాక్సిడెంట్ మా కంట పడింది. ఓ పెళ్లి వాహనానికి ప్రమాదం జరిగింది. చాలామందికి గాయాలయ్యాయి. అందులో ఒక చిన్న పాప కూడా ఉంది. మా అంబులెన్స్‌లోనే వారిని ఎక్కించారు. ఆ పాపను చూశాక.. మాకు జరిగిన ప్రమాదాన్ని మర్చిపోయాం. ఆ పాపను ఐసీయూలో చేర్పించారు. తనకు ఎలా ఉందో తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఉదయం వరకూ ఆ రూమ్ బయటే నిల్చొని ఉన్నా. ఆ ఒక్క రాత్రి నన్నెంతో మార్చేసింది. జీవితాన్ని చూసే విధానం మారింది. మనం ఈ భూమ్మీద ఉండే ప్రతి క్షణాన్ని సంతోషంగా జీవించాలని అర్థమైంది" అని నాని చెప్పారు. ఇక ఆ ప్రమాదం తర్వాత తాను కారు నడిపింది తక్కువే అని అన్నారు.

# అవనిగా త్రిష.. పోస్టర్ పంచుకున్న 'విశ్వంభర' టీమ్

చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'విశ్వంభర' త్రిష కథానాయికగా కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ చిత్రీకరణ దశలో ఉంది. ఆదివారం త్రిష పుట్టినరోజు పురస్కరించుకొని చిత్రబృందం సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలో ఆమె పాత్రను పరిచయం చేసింది. ఇందులో ఆమె అవని పాత్రలో కనిపించనున్నారని చెప్పి.. లుక్‌ను రివీల్ చేసింది. చీరకట్టులో ఆమె మెరిసిపోతూ కనిపించారు.2006లో విడుదలైన 'స్టాలిన్' తర్వాత చిరంజీవి – త్రిష కలిసి వర్క్ చేస్తోన్న చిత్రమిది. సోషియో ఫాంటసీ కథాంశంతో రూపొందుతోంది. సినిమాలో భారీ విజువల్ ఎఫెక్ట్స్ ఉంటాయని ఇప్పటికే టీమ్ వెల్లడించింది. ఓ వైపు చిత్రీకరణ చేస్తూనే మరోవైపు, డబ్బింగ్ పనులను ఆరంభించేసింది. ఈ సినిమాలో చిరంజీవి హనుమాన్ భక్తుడిగా కనిపించనున్నారు. చిరంజీవి కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా ఇది నిలవనుంది. ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎం.ఎం.కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల తొలిపాట విడుదలైంది.నాలుగు పదుల వయసులోనూ కెరీర్ పరంగా రాణిస్తున్నారు త్రిష. కోలీవుడ్‌లో ఇటీవల వరుస సినిమాల్లో ఆమె నటించారు. ఈ ఏడాదిలోనే ఆమె నటించిన మూడు చిత్రాలు విడుదలయ్యాయి. ప్రస్తుతం ఆమె 'థగ్ లైఫ్', 'సూర్య 45', 'రామ్' ప్రాజెక్ట్‌ల్లో నటిస్తున్నారు.

